www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 11 డిసెంబర్ 2023



నేడు నూజివీడులో జిల్లాస్థాయి 'స్పందన'

కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాస్థాయి జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం ఈనెల 11న సోమవారం ఉదయం 10 గంటల నుంచి నూజివీడు సబ్ కలెక్టర్ వారి కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరు, జిల్లా జాయింటు కలెక్టరు, జిల్లాస్థాయి అధికారులు అందరూ హాజరై అర్జీలు స్వీకరిస్తారు. అదేవిధంగా జిల్లాలోని అన్ని డివిజనల్, మండల, మున్సిపల్ కార్యాలయాలలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం యధావిధిగా నిర్వహించబడుతుందని తెలియజేశారు.

తడిచిన ధాన్యానికి 'మద్దతు' ఏదీ..!

తేమ 17 శాతానికి మించితే కేజీల లెక్కన కటింగ్

ఆరబెట్టేందుకు చోటులేక రైతులు నానావస్థలు

రంగుమారిన, మొలకెత్తిన ధాన్యంతో అన్నదాత పరిస్థితి అగమ్యగోచరం

ఆదుకోవడం అంటే ఇదేనా అంటూ రైతన్న ఆగ్రహం

రెండు జిల్లాల్లోనూ 2.40 లక్షల ఎకరాల్లో పంట పొలాల్లోనే

నేలనంటి, నీటిలో నానుతున్న పంటనే అత్యధికం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'ప్రతి రైతునూ ఆదుకుంటాం. తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం' అంటూ సిఎం నుంచి మంత్రులు, ఎంఎల్ఎలు, అధికారులు సైతం చెప్పడమే తప్ప క్షేత్రస్థాయిలో మాత్రం దానికి విరుద్ధమైన పరిస్థితులు కన్పిస్తున్నాయి. తడిచిన, రంగుమారిన ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఇప్పటి వరకూ ఎటువంటి ఆదేశాలనూ ప్రభుత్వం విడుదల చేయలేదు. తేమ 17 శాతానికి మించితే బస్తాకు కిలో ధాన్యం తగ్గించి మిల్లర్లు ధర నిర్ణయిస్తున్నారు. 25 శాతం తేమ వరకూ కొనుగోలు చేస్తారని చెబుతున్నా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు మాత్రం కొనుగోలు చేయడం లేదు. తుపాను వెళ్లి ఐదు రోజులు గడిచినా ఇప్పటి వరకూ తడిచిన, రంగుమారిన ధాన్యం కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఉలుకుపలుకూ లేకుండాపోయింది. దీంతో తడిచిన, మొలక వచ్చిన ధాన్యాన్ని అయినకాడికి అమ్మడం తప్ప రైతులకు వేరే ప్రత్యామ్నాయం లేకుండాపోయింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలవ్యాప్తంగా ఖరీఫ్‌లో దాదాపు నాలుగు లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. తుపాను వచ్చేసరికి 40 శాతం వరకూ మాసూళ్లు పూర్తయ్యాయి. ఇంకా రెండు జిల్లాల్లోనూ దాదాపు 2.40 లక్షల ఎకరాల్లో పంట మాసూళ్లు పూర్తి కాకుండానే ఉండిపోయింది. తుపానుకు ముందు మాసూళ్లు పూర్తయిన ధాన్యం సైతం రెండు జిల్లాల్లోనూ 20 వేల టన్నులకుపైగా ఉన్నట్లు అధికారుల మాటలు చెబుతున్నాయి. ధాన్యపురాశులు నీట మునగడంతో అడుగుభాగం మొత్తం తడిచి ముద్దయ్యింది. మొలకలు సైతం వచ్చిన పరిస్థితి. అటువంటి ధాన్యం కొనుగోలుపై నీలినీడలు అలుముకున్నాయి. తడిచిన, రంగుమారిన ధాన్యానికి సంబంధించి ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలూ రాకపోవడంతో కొనుగోలు చేయడం లేదు. ఆరబెట్టిన తర్వాతే కొనుగోలు చేస్తామని అధికారులు ఖరాఖండిగా చెబుతున్నారు. ఆరబెట్టుకునేందుకు చోటులేక రైతులు నానావస్థలు పడుతున్నారు.



మొలకలు వచ్చిన ధాన్యం

కేజీల లెక్కన కటింగ్‌లతో కొనుగోలు

ధాన్యం 25 శాతం తేమ ఉన్నప్పటికీ కొనుగోలు చేస్తామనే ప్రకటనలతో రైతులకు ఎటువంటి న్యాయమూ జరగని పరిస్థితి ఉంది. 17 శాతం తేమ దాటిన తర్వాత ఒక్కో శాతం తేమకు బస్తాకు కిలో ధాన్యం తగ్గించి ధర నిర్ణయిస్తున్నారు. దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. తుపాను దెబ్బకు రైతులకు ధాన్యం పొలాల్లోంచి పైకి తెచ్చేందుకు, ఆరబెట్టేందుకు ఎకరాకు రూ.నాలుగు వేల నుంచి రూ.ఐదు వేల వరకూ ఖర్చవుతోంది. నేలనంటిన పంట దిగుబడి తగ్గడమే కాకుండా, రంగుమారి, మొలకలు వచ్చిన పరిస్థితి ఉంది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కాకుండా తగ్గించి కొనుగోలు చేస్తే రైతులకు ఏవిధంగా న్యాయం జరుగుతుందో ప్రభుత్వమే చెప్పాలి. తడిచిన, రంగుమారిన ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయాలని రైతులు ముక్తకంఠంతో కోరుతున్నారు. తడిచి, రంగుమారిన ధాన్యం కొనుగోలుపై ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. తుపానుతో దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాల్సి ఉంది. రెండు జిల్లాల్లోనూ ఇంకా పెద్దఎత్తున పంట ఉంది. మద్దతు ధర దక్కకపోతే ఎకరాకు తక్కువగా లెక్కించినా రూ.నాలుగైదు వేలు రైతులు నష్టపోతారు. ఖర్చులు అధికం కావడంతోపాటు ధర కూడా తగ్గితే రైతుల పరిస్థితి దయనీయంగా మారనుంది.

తేమశాతంతో నిమిత్తం లేకుండా ధాన్యాన్ని మద్దతు ధరకు కొనాలి

కె.శ్రీనివాస్, ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి

తుపాను ప్రభావంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తడిచిన ధాన్యం గట్టుపైకి తేవడానికి పెద్దఎత్తున అదనంగా పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. తేమశాతంతో నిమిత్తం లేకుండా తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయాలి. పంట నేలనంటడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం పడటమే కాకుండా, ఖర్చు పెరుగుతోంది. తడిచిన, రంగుమారిన ధాన్యం మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి. కిలోల ప్రాతిపదికన కోతలు పెట్టడాన్ని అరికట్టి రైతులను ఆదుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.



బాధ్యతలు స్వీకరిస్తున్న యుటిఎఫ్ నూతన రాష్ట్ర కమిటీ

ముగిసిన యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు

పలు తీర్మానాలు ఆమోదం - నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రెండు రోజులపాటు జరిగిన యుటిఎఫ్ 49వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు ఆదివారం ముగిశాయి. మినీబైపాస్‌లోని చలసాని గార్డెన్స్‌లో శని, ఆదివారాల్లో జరిగిన ఈ సమావేశాలకు 26 జిల్లాలకు చెందిన అధ్యక్ష కార్యదర్శులు విద్యారంగంలో నెలకొన్న సమస్యలు, ఎదురవు తున్న సవాళ్లపై చర్చించారు. ముఖ్యంగా నూతన విద్యావిధానం పేరుతో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల విద్యార్థుల డ్రాపవుట్‌లు పెరగడంపై సమావేశం చర్చించింది. పాఠశాలల విలీనంతో విద్యార్థులు పెద్దసంఖ్యలో ప్రభుత్వ పాఠశాలలను వదిలి ప్రయివేట్ పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారని నేతలు స్పష్టం చేశారు. ముఖ్యంగా మూడు, నాలుగు, ఐదు తరగతుల విలీనం గ్రామీణ ప్రాంత విద్యార్థుల పాలిట శాపంగా మారిందని తెలిపారు. ఉపాధ్యాయుల రేషన్‌లైజేషన్ పేరుతో ఉపాధ్యాయ పోస్టుల సంఖ్య తగ్గించి ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే దిశగా ముందుకెళ్తోందని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న సుమారు 25 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం మీనమేషాలు లెక్కించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి వస్తే వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తానని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి సిపిఎస్ కంటే దారుణమైన జిపిఎస్ ఉద్యోగుల మీద బలవంతంగా రుద్ది అదేదో గొప్ప విషయం అన్నట్లుగా మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు. పెండింగ్ డిఎలు, అలవెన్సులు, ఇతర బకాయిలు ఇవ్వకుండా ప్రభుత్వం కాలయాపన చేయడం సరికాదన్నారు. కనీసం ఒకటో తేదీన జీతాలు ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం ఉండటం సిగ్గుచేటని, ఇదే పరిస్థితి కొనసాగితే తెలంగాణలో కెసిఆర్ ప్రభుత్వానికి పట్టిన గతే వైసిపి ప్రభుత్వానికీ తప్పదని హెచ్చరించారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తన వైఖరి మార్చుకుని ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించడంతోపాటు 12వ పిఆర్‌సిని త్వరితగతిన అమలు చేయాలని సమావేశం డిమాండ్ చేసింది. అనంతరం పలు అంశాలపై తీర్మానాలు చర్చించి ఆమోదించారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్ వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా కెఎస్ఎస్.ప్రసాద్, కోశాధికారిగా బి.గోపీమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో పాటు 20 మంది ఆఫీస్ బేరర్స్‌గాను, ఏడుగురితో ఆడిట్ కమిటీ, వందమందితో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడానికి పోరాటాల ఉధృతం చేయాలని, పాత పెన్షన్ సాధనే లక్ష్యంగా ఉద్యమించాలని సమావేశం పిలుపునిచ్చింది. సమావేశాల్లో పిడిఎఫ్ ఎంఎల్‌సిలు, మాజీ ఎంఎల్‌సిలు, సీనియర్ నేతలు పాల్గొని తమ సందేశాలిచ్చారు.

పంట నష్టం నమోదు వెంటనే ప్రారంభించాలి

రైతులను తగిన విధంగా ఆదుకోవాలి

కలెక్టర్‌కు సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పంట నష్టం నమోదు (ఎన్యూమరేషన్) ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని, సకాలంలో పంటల నష్టాన్ని అంచనా వేసి రైతులను ఆదుకోవాలని కోరుతూ సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్‌కు ఆదివారం ఆన్‌లైన్ ద్వారా వినతిపత్రాన్ని అందించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తుపాను వల్ల పంటలవారీగా, రైతులవారీగా నష్టం అంచనాలు తయారుచేసే ఎన్యూమరేషన్ ప్రక్రియ ఇంతవరకూ ప్రారంభం కాకపోవడం వల్ల రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోందని పేర్కొన్నారు. రైతులను ఆదుకుంటామని ఒకపక్క ప్రకటనలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఇంకా మార్గదర్శకాలు విడుదల చేయకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. నష్టం తీవ్రత కన్పించినప్పుడే అంచనా వేస్తే రైతులకు న్యాయం జరుగుతుందని, ఆలస్యమయ్యే కొద్దీ రైతులు అన్యాయానికి గురవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. పడిపోయిన వరి చేలల్లో నీరు బయటకు పోయాక, తడిచిపోయిన ధాన్యాన్ని, వరి పనలను అరబెట్టుకున్నాక అధికారులు వచ్చినా ఫలితం ఉండదని తెలిపారు. గతంలో ఉన్న మార్గదర్శకాల ప్రకారమే 35 శాతంకన్నా ఎక్కువ నష్టం ఉంటేనే వివరాలు నమోదు చేస్తామని, ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తామని అధికారులు చెప్పడం సరికాదని పేర్కొన్నారు. తుఫాను వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నా, ఆర్థిక నష్టం ఎంతనేది తేల్చలన్నా తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేయాలని కోరారు. ప్రాథమిక అంచనాల ప్రకారం ఏలూరు జిల్లాలో 41,473 ఎకరాల్లో వరిపంట దెబ్బతిందని, మొక్కజొన్న 8,486 ఎకరాలు, మినుము 4,101 ఎకరాలు, పెసలు 5,886 ఎకరాలు, వేరుశెనగ 930 ఎకరాలు, పొగాకు 4,352 ఎకరాలు, పత్తిపంట 2,827 ఎకరాలు మొత్తంగా 68,052 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు తేల్చారని తెలిపారు. తక్షణం పంట నష్టవివరాల నమోదు (ఎన్యూమరేషన్) మొదలు పెట్టాలని, దెబ్బతిన్న ఆహార పంటకు రూ.25 వేలు, వాణిజ్య పంటలకు రూ.50 వేలు చొప్పున పరిహారం ఇవ్వాలని, కల్లాలపై ఉన్న ధాన్యాన్ని తక్షణం కొనుగోలు చేయాలని, తేమశాతంతో నిమిత్తం లేకుండా తడిచిన ధాన్యాన్ని మద్దతు ధరకే కొనుగోలు చేయాలని, అవసరమైన వాహనాలు, బరకాలు సమకూర్చాలని డిమాండ్ చేశారు. పనులు కోల్పోయిన వ్యవసాయ కార్మికులకు, అసంఘటితరంగ కార్మికులకు, చేతివృత్తిదారులకు రూ.ఐదు వేలు చొప్పున పరిహారం ఇవ్వాలని, దెబ్బతిన్న ఇళ్లకు మరమ్మతులకు అవసరమైన పరిహారం అందజేయాలని, దెబ్బతిన్న రోడ్లను తక్షణం మరమ్మతు చేపట్టాలని, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాలని, నష్టపరిహారం కౌలుదారులకు అందించాలని విజ్ఞప్తి చేశారు.

12న గాలాయిగూడెంలో గవర్నర్ పర్యటన

పకడ్బందీగా ఏర్పాట్లు: కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు



రాష్ట్ర గవర్నర్ ఈ నెల 12వ తేదీ మంగళవారం జిల్లాకు రానున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. గవర్నర్ ఎస్.అబ్దుల్‌నజీర్ ఈ నెల 12న దెందులూరు మండలం గాలాయిగూడెంలో 'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర'లో పాల్గొంటున్న సందర్భంగా ఆయా అధికారులకు విధులను కేటాయిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. గవర్నర్ పర్యటనకు పూర్తిస్థాయి భద్రతా ఏర్పాట్లు చేయాలని ఎస్‌పిని ఆదేశించారు. గవర్నర్ పర్యటించే మార్గంలో పారిశుధ్య పరిస్థితులు మెరుగ్గా ఉండాలని, అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. కార్యక్రమం జరిగే ప్రదేశంలో షామియానా, డయాస్, తదితర ఏర్పాట్లు చేయాలని, గవర్నర్ పర్యటించే మార్గంలో అవసరమైన ప్రదేశాల్లో రోడ్లకు మరమ్మతులు చేయాలని ఆర్అండ్‌బి ఎస్ఇని ఆదేశించారు. విద్యుత్ సరఫరాకు ఎటువంటి అంతరాయమూ లేకుండా చూడాలని ట్రాన్స్‌కో అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమం జరిగే ప్రదేశంలో అత్యవసర మందులతో అంబులెన్స్ సిద్ధంగా ఉంచాలని డిఎంహెచ్ఒను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై సంబంధిత అధికారులు స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో రాష్ట్ర గవర్నర్ పర్యటన విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

తెగుళ్ల నుంచి మామిడిని కాపాడుకోవాలి

నూజివీడులోని పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త, హెడ్ డాక్టర్ బొర్రా కనకమహాలక్ష్మి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి



ప్రతిఏటా సీజన్ వారీగా లభించే పండ్లలో మామిడికే అగ్ర తాంబూలం. పండ్లకు రారాజుగా ఉన్న మామిడి ఫలం భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. మనదేశంలో పండే మామిడి పండ్లకు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ఆదరణ ఉంది. అందుకే ఏటేటా ఎగుమతులు కూడా పెరుగుతున్నాయి. బంగినపల్లి, కలెక్టర్, తీపి మామిడి, సువర్ణరేఖ, నీలాలు, చిన్నరసం, పెద్దరసం పేర్లు వింటేనే నోరూరుతుంది. ప్రపంచంలోనే అత్యధికంగా ఏటేటా 25 మిలియన్ టన్నుల మామిడి పండ్లు మనదేశంలోనే ఉత్పత్తి అవుతున్నాయి. అయితే ప్రకృతి వైపరీత్యాలు, తుపాన్లు, చీడపీడలు, సాగునీటి సౌకర్యాలు, మార్కెట్‌లో ధరలు వంటి కారణాలతో మామిడి సాగు ఏటేటా తగ్గిపోతోంది. ఈ క్రమంలో నూజివీడులోని డాక్టర్ వైఎస్ఆర్ హెచ్‌యు ఆధ్వర్యంలోని మామిడి పరిశోధనా స్థానం ఏటేటా తన పరిశోధనా పరిధిని విస్తృతి చేసుకుంటూ రైతులకు మామిడి పంటను కాపాడుకునే సస్యరక్షణ చర్యలను తెలియజేస్తోంది. ఈ సందర్భంగా పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, హెడ్ డాక్టర్ బొర్రా కనకమహాలక్ష్మి పరిశోధనల గురించి ప్రజాశక్తికి వివరించారు. వివరాలు ఆమె మాటల్లోనే..

ప్రశ్న : మామిడి సాగుపై ఎలాంటి పరిశోధనలు జరుగుతున్నాయి?

మామిడిలో అధిక సాంద్రతతో మొక్కలను వేసి ఉత్పత్తి పెంపుదల, చీడ పీడల నివారణ, విదేశీ ఎగుమతుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇలా అనేక అంశాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. మామిడి అభివృద్ధికి సాంకేతికపై పరిశోధనలు, చీడపీడల నివారణపై రైతులకు అవగాహన, ఎగుమతులకు వీలుగా మామిడి రకాలపై సూచనలు, అధిక దిగుబడులు సాధించేందుకు సలహాలు, ప్రూనింగ్ పద్ధతులను ప్రోత్సహించటం, నీటి యాజమాన్య పద్ధతులను వివరించటం, కోతలు పూర్తయిన తర్వాత తోటల్లో తీసుకోవాల్సిన చర్యలు గురించి రైతాంగానికి అవగాహనా సదస్సులు ఏర్పాటు చేసి తెలియజేస్తున్నాం. మామిడి సాగున్న అన్ని ప్రాంతాలకు మా పరిశోధనా ఫలితాలు అందేలా చర్యలు తీసుకుంటున్నాం.

పశ్న : మామిడికి ఎలాంటి వాతావరణం అనుకూలం?

మామిడికి ప్రధానంగా రాత్రిపూట చలి వాతావరణం, పగలు వేడి వాతావరణం ఉన్నప్పుడు పూమొగ్గలు వస్తాయి. ఈ ఏడాది వాతావరణం అనుకూలంగా ఉండటంతో మామిడి పూతలు ఉధృతంగా రావటానికి అవకాశం వుంది. ఇప్పటికే కొంతమేర మాత్రమే పూతలు వచ్చాయి. ఇంకా రావాల్సి వుంది. నూజివీడు, విస్సన్నపేట, చాట్రాయి మండలాల్లో కొన్ని చోట్ల ముదురు కాపులు వచ్చాయి. మామిడి సాగులో పూత దశ నుంచి కోత దశ వరకూ రైతాంగం తీసుసుకోవాల్సిన శాస్త్రీయ యాజమాన్య పద్ధతులను ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నాం. వర్షాలు పడి, పడుతుండటం ఆగగానే మామిడికి తేనేమంచు, తామర పురుగులు, పక్షికన్ను తెగుళ్లు వ్యాపించే అవకాశం ఉంది. వీటి నివారణకు తక్షణమే ఇమిడిక్లోరిట్ 0.3 మిల్లీ గ్రాములు లేదా త్రోమిథాక్సిమ్ 0.5 గ్రాములు, సిలింద్రనాశినిలైన కార్బన్‌డిజమ్ 1 గ్రాము లేదా క్లోరోథలోనిల్ 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. లేదా మ్యాంకోజబ్ 2 గ్రాములు, జిగురు 0.5 మిల్లీ గ్రాములు కలిపి పిచికారీ చేయించాలి.

ప్రశ్న : తెగుళ్ల నివారణా పద్ధతులను పాటించాలి?


మామిడిలో అధిక నష్టం కలిగించే చీడపీడలైన తేనెమంచు, తామర, చెదల పురుగు, తెగుళ్లలో పక్షికన్ను తెగులు(ఆంత్రక్నోస్), బూడిద, నల్లమచ్చ తెగులు ముఖ్యమైనవి. తేనే మంచు పురుగు పూత నుంచి లేత చిగుళ్ల నుంచి రసం పీల్చటంతో పూత రాలిపోయే ప్రమాదం ఉంది. ఈ పురుగులు విసర్జించిన జిగురుపై మసి తెగులు వృద్ధి చెందుతుంది. నల్లతామరతో పాటుగా ఇతర, పురుగులు, తెగుళ్ల నివారణా చర్యలపై పెద్ద ఎత్తున రైతులకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించి సలహాలు, సూచనలు అందిస్తున్నాం. మంచు పెరిగే కొద్దీ మామిడి పిందెలు, కాయలకు మంగు, దోమపాటు, ఇతర మచ్చలు వచ్చే అవకాశం ఉంటుంది. అందువల్ల మా వంతుగా కాయల రక్షణ కోసం కవర్లు వాడమని చెబుతున్నాం. వీటిని పిందె దశలోనే తొడిగితే కాయ నాణ్యతగా ఉండి మార్కెట్లో అధిక ధర లభిస్తుంది.

ప్రశ్న : టాప్ వర్కింగ్ పద్ధతులు ఎలా పాటిస్తారు?

నూజివీడు మామిడి పరిశోధన కేంద్రంలోని క్షేత్రంలో ఎక్కువ వయస్సున్న ముదురు చెట్లను మొదలు పైవరకు నరికి తొలగించి టాప్ వర్కింగ్ పద్ధతిలో పూర్తిగా వాటినే పునరుద్ధరిస్తున్నాం. దీనిలో భాగంగా చెట్టును ఆరడుగుల ఎత్తు వరకు తొలగించి అక్కడి నుంచి కావాల్సిన రకాన్ని అంటు కట్టి పునరుద్ధరిస్తున్నాం. ఇలా చేయటం వల్ల రెండేళ్లకే దిగుబడి ప్రారంభమవుతుంది. అలాగే అధిక, పాక్షిక సాంద్ర పద్ధతుల్లో రైతులతో మొక్కలు నాటించి వాటిలో ఆచరించాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నాం. ముదురు తోటలు ఉన్న రైతులతో కూడా మాట్లాడి పునరుద్ధరణ చర్యలను ప్రోత్సహిస్తున్నాం. ఒకే మామిడి చెట్టుకు అనేక రకాల కాయలు కాసేలా చేసే అంట్లను తయారుచేయిస్తున్నాం.

ప్రశ్న : లింగాకర్షణ బుట్టలతో మేలు జరుగుతుందా?

మామిడికి ఆశించే పండు ఈగ నివారణకు లింగాకర్షక బుట్టను రూపొందించి రాష్ట్రంలోని మామిడి రైతులకు ఇక్కడి నుంచే అందించే ఏర్పాట్లు కొనసాగిస్తున్నాం. ప్రతికూల వాతారణం వల్ల తోటల్లో వచ్చే మార్పులపై పరిశోధనలు కొనసాగుతున్నాయి. మామిడిలో సేంద్రియ వ్యవసాయ పద్ధతులను ఆచరిస్తే దిగుబడులు బాగా పెరుగుతాయని తోటల్లో క్షేత్రస్థాయికి వెళ్లి రైతులను ప్రోత్సహించి ప్రయోగాత్మకంగా తెలయజేస్తున్నాం. ఒక ఏడాది కాస్తే మరో ఏడాది కాయకపోవటం మామిడి సాధారణ లక్షణం. గతేడాది మామిడి కాపు తక్కువగా ఉన్న నేపథ్యంలో ఈ ఏడాది కాపు ఎక్కువగా ఉంచొచ్చునని ఇప్పుడున్న పరిస్థితిని బట్టి రైతులు భావిస్తున్నారు. నూజివీడు ప్రాంతంలోని బంగినపల్లి, తోతాపురి, చిన్న, పెద్ద రసాలు, చెరకు రసం వంటి మామిడి తోటల్లో పూత ప్రస్తుతం ఉధృతంగా కనిపిస్తుంది. ప్రస్తుతం 10 నుంచి 20 శాతం వరకూ పూతలు వచ్చాయి. మిగతా భాగం ఇప్పటి నుంచి వస్తుంది.



ప్రశ్న : నాణ్యమైన పంట దిగుబడులు రావాలంటే ఏమి చేయాలి?

మామిడి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందింది. అందువల్ల రైతులు నాణ్యమైన దిగుబడులు సాధించటానికి గాను రైతులకు శాస్త్రవేత్తలతో పాటు, ఉద్యానవనశాఖ అధికారులు సలహాలు, సూచనలు తెలియజేస్తున్నాం. పాటించేలా నిరంతరం కృషి చేస్తున్నాం. నూజివీడు మండలం సిద్ధార్థనగర్ ప్రాంతంలో 26 ఎకరాల్లో రూ.275 కోట్లతో మ్యాంగో పల్ప్ అండ్ ప్రాసెసింగ్ యూనిట్ పెట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ట్రాప్స్, లూర్స్ వినియోగంపైన రైతులకు తెలియజేస్తున్నాం. రాబోయే రోజుల్లో మామిడికి మహర్దశ ఉంది. తోటలను ఎవ్వరూ నరికేయొద్దు, తెల్లపూత సమయంలో రసాయన మందులు పిచికారీ చేయొద్దు, పొటాషియం, నైట్రేట్, జింక్, బోరాన్, మాంగనీస్‌లను పిచికారీ చేసుకోవాలి. దీనివల్ల చెట్టు ఆరోగ్యంగా ఉంటుంది. కాయల నాణ్యత అధికం అవుతుంది. తేనెమంచు పురుగు, తామర పురుగుల ఉధృతిని బట్టి రసాయన మందుల పిచికారీ చేయాలి.

లోక్‌అదాలత్‌లో 1,908 కేసుల పరిష్కారం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా ఈనెల 9వ తేదీన నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 1,908 పెండింగ్ కేసులను పరిష్కారం చేయటం జరిగిందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆదివారం తెలియజేశారు. ఈమేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశానుసారంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఏలూరు వారి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 36 బెంచీలు ఏర్పాటు చేయడం జరిగినదని, వీటిలో ఏలూరులో 9 బెంచీలు, భీమవరం 4, కొవ్వూరు 4, నరసాపురం 3, తణుకు 5, తాడేపల్లిగూడెం 4, పాలకొల్లు 1, నిడదవోలు 2, జంగారెడ్డిగూడెం 2, చింతలపూడి 1, భీమడోలు 1 ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. 1,610 క్రిమినల్ కేసులు, 40 కుటుంబ వివాద కేసులు, 111 మోటార్ వాహన ప్రమాద బీమా కేసులు, 147 సివిల్ కేసులను రాజీ చేయగా, 151 ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కారం చేయబడ్డాయని తెలిపారు. వీటిలో ఏలూరు 428, భీమవరం 304, చింతలపూడి 103, జంగారెడ్డిగూడెం 138, కొవ్వూరు 169, నర్సాపురం 162, పాలకొల్లు 58, తాడేపల్లిగూడెం 185, తణుకు 230, నిడదవోలు 68, భీమడోలు 63 కేసులు ఈ జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించామని తెలిపారు. వీటితో పాటుగా జిల్లా వ్యాప్తంగా 6,804 కేసులను కూడా రాజీ చేయడం జరిగిందన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి తోడ్పడిన న్యాయవాదులకు, పోలీస్ అధికారులకు, రెవెన్యూ సిబ్బందికి, ఇన్సూరెన్స్ అధికారులకు, బ్యాంకు అధికారులకు, చిట్ ఫండ్ ప్రతినిధులకు, లేబర్ డిపార్ట్మెంట్ అధికారులకు, మున్సిపల్ సిబ్బందికి, బిఎస్ఎన్ఎల్ వారికి, జిల్లా పంచాయతీ శాఖ వారికి, పత్రికా విలేకరులకు, ఆల్ ఇండియా రేడియో విజయవాడ వారికి, రవాణాశాఖ అధికారులకు, ఎక్సైజ్ అధికారులకు, రైల్వే శాఖ అధికారులకు, అడ్వకేట్ క్లర్కులకు, అగ్రికల్చరల్ అధికారులకు, మిగతా శాఖల అందరికీ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమ కుమార్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌కె.రత్న ప్రసాద్ కృతజ్ఞతలు తెలియజేశారు.

భవన నిర్మాణ కార్మికుల ఉపాధి కాపాడాలి

13న కలెక్టరేట్ వద్ద ధర్నాను జయప్రదం చేయాలి

భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.రమణారావు

ప్రజాశక్తి - నిడమర్రు



సమావేశంలో మాట్లాడుతున్న రమణారావు

ఇసుక సరఫరా కొనసాగించి, భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారపల్లి రమణారావు కోరారు. ఆదివారం భవన నిర్మాణ కార్మికుల మండల కమిటీ సమావేశం నిడమర్రు ప్రజా సంఘాల కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి భవన నిర్మాణ కార్మికులు ప్రభుత్వ బాధితులుగానే మిగిలిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక అందించడంలో, నిర్మాణ కార్మికుల ఉపాధి కాపాడడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఈనెల 13న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ప్రభుత్వం వెంటనే ఇసుక సమస్య పరిష్కరించి, కార్మికులకు ఉపాధి కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాలు అమలు చేయకుండా, సంక్షేమ బోర్డులో నిధులను ప్రభుత్వ అవసరాలకు వాడుకున్న కార్మికులు ఏమీ చేయలేదన్నారు. గత ప్రభుత్వానికి ఏర్పడిన పరిస్థితి మీకు ఏర్పడుతుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కంచం ప్రసాద్, కమిలి నాని, కన్నాజి మార్కండేయులు, తోట వెంకటేశ్వరరావు, రోకలి ఏసిరెడ్డి, కానూరు రాజు పాల్గొని మాట్లాడారు.

క్షేత్రస్థాయిలో తుపాను పంట నష్టం నమోదు

ఉంగుటూరు: తుపాను తాకిడికి వివిధ పంటలు దెబ్బతిన్న నేపథ్యంలో గత నాలుగు రోజుల నుంచి క్షేత్రస్థాయిలో ఎన్యుమరేషన్ చేస్తున్నామని మండల వ్యవసాయ అధికారి బాలిన వెంకటేష్ వెల్లడించారు. ఇప్పటి వరకూ వరి 198 ఎకరాలు, పొగాకు 29, మినుములు 3, మొక్కజొన్న 26 ఎకరాల్లో ఆదివారం నాటికి ఎన్యుమరేషన్ చేశామన్నారు. ఈనెల 12తో పూర్తి స్థాయిలో పంట నష్టం అంచనా వేసి నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నామన్నారు. ఆయా గ్రామాల విఆర్ఒలు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎన్యుమరేషన్ చేస్తున్న వ్యవసాయ సిబ్బంది



వనసమారాధనలో పాల్గొన్న మహిళలు

సిఐటియు ఆధ్వర్యంలో వనసమారాధన

ఆట, పాటలతో అలరించిన కార్మికులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

నిరంతరం శ్రమించే కార్మికులు కార్తీకమాస వనభోజనాలలో విందు, వినోదంతో అలరించడం సంతోషకరమని డాక్టర్ వజ్రకిరణ్ అన్నారు. ఆదివారం సిఐటియు ఆధ్వర్యంలో పనస సూర్యారావు అధ్యక్షతన కార్మికులకు వనభోజనాల ఏర్పాటు చేయడం జరిగింది. మండలంలో కార్మికులందరూ పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ వజ్రకిరణ్, మానవతా వైస్ ప్రెసిడెంట్ టి.త్రిపుర సుందరి, ఎల్.ఆర్.కృష్ణబాబు హాజరైనారు. ఈ సందర్భంగా వజ్ర కిరణ్ మాట్లాడుతూ కార్మికులకు వనభోజనాలు ఏర్పాటు చేసిన సిఐటియు సంఘానికి అభినందనలు తెలియజేశారు. అనంతరం సిఐటియు పట్టణ కార్యదర్శి షేక్ సుభానీ మాట్లాడుతూ నేడు కుల భోజనాలతో వేస్తున్న సంస్కృతిని వ్యతిరేకిస్తూ కార్మికులందరినీ ఒక తాటి మీదకు తీసుకొస్తూ, ఒకే వేదికగా వనభోజనాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కార్మికులందరూ ఆట, పాటలతో సంతోషంగా గడపటం హర్షణీయం అన్నారు. అలాగే ఆటల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశామని తెలిపారు. బహుమతులు అందించడానికి సహకారం ఇచ్చిన కూరగాయల షాపు నాని, ఆటో వర్కర్ యూనియన్ నాయకులు నాని, మాడారత్నం బట్టల షాపు, చిట్టూరి సుబ్బారావు బట్టల షాపు వారికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు ఆర్.లక్ష్మీ పావని, కార్యదర్శి షేక్ మస్తాన్, శిరీష, అష్రఫ్, బాలరాజు, లక్ష్మణ్, వి.నాగలక్ష్మి, జగదాంబ, మేరీ రోజా భారతి పాల్గొన్నారు.


రవిశేఖర్‌ను సన్మానిస్తున్న వేణుగోపాల అప్పారావు(చంటినాయన)

వైసిపి మండల అధ్యక్షులుగా రవిశేఖర్

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

వైసిపి మండల ఉపాధ్యక్షులుగా అమ్మవారిగూడెం గ్రామానికి చెందిన మల్లంపల్లి రవిశేఖర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు తనయులు మేకా వేణుగోపాల అప్పారావు(చంటినాయన) శేఖర్‌ను శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పి.నరశింహారావు, జిల్లా పార్టీ కార్యదర్శి ఎం.హరిబాబు, జడ్‌పిటిసి పి.వీరబాబు, వి.సక్కేశ్వరరావు, కె.ప్రదీప్, ఆర్.సత్యనారాయణ, పి.లక్ష్మణరావులు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య శిబ్బంది

ఉచిత ప్రసూతి, కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి మండలం ప్రగఢవరం గ్రామ పంచాయతీలోని ఎలిమెంటరీ స్కూల్‌లో లోటస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ప్రసూతి, కంటి ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ప్రసూతి వైద్య నిపుణులు జోష్న, కంటి వైద్య నిపుణులు చైతన్య కుమార్ ఉచితంగా బిపి, షుగర్ పరీక్షలు చేసి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. అత్యుత్తమ మిషనరీతో ఈ పరీక్షలు నిర్వహించారు. పలు పరీక్షలు చేయించుకునే వారు చింతలపూడి లోటస్ హాస్పిటల్‌కు వచ్చి పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

తుపాను వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మిచౌంగ్ తుపాను వల్ల కురిసిన భారీ వర్షాలకు రాష్ట్రవ్యాప్తంగా అనేక పంటలు దెబ్బతిన్నాయని, చిన్న సన్న కారు రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం అధ్యక్షులు వెట్టి సుబ్బన్న ప్రభుత్వాలను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. వరి, మొక్కజొన్న, వేరుసెనగ, పొగాకు, మిరప, ప్రత్తి పంటలు తీవ్రంగా దెబ్బతిని రైతాంగం తీవ్రమైన నష్టానికి గురి అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం ప్రభుత్వం అందించాలని అన్నారు. అదే విధంగా తడిసిన వరి ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని కోరారు. అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేసి నష్టపోయిన రైతాంగానికి ఆదుకోవాలన్నారు. జీలుగుమిల్లి మండల కేంద్రంలో చేతికందిన పంటలు నీటిపాలై రైతులకు తీరని దుఖాన్ని మిగిల్చిందని, ప్రభుత్వం తగిన నష్టపరిహారం చెల్లించి రైతులను కష్టాల నుంచి గట్టెక్కించాలని కోరారు. అదే విధంగా వరదలలో మరణించిన కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్ గ్రేషియా ఇచ్చి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

నేరాలు - ఘోరాలు

లారీని ఢీకొన్న ఆయిల్ ట్యాంకర్

డ్రైవర్ మృతి, మరొకరికి గాయాలు

ప్రజాశక్తి - ఉంగుటూరు, భీమడోలు

గుండుగొలను - రాజమండ్రి జాతీయ రహదారిల గుండుగొలను వద్ద ఆదివారం ఆగి ఉన్న కంటైనర్ లారీని వెనక నుంచి ఆయిల్ ట్యాంకర్ ఢీకొన్న ఘటనలో డ్రైవర్ మృతి చెందగా రెండో డ్రైవర్ గాయపడ్డారు. ఏలూరు వైపు వెళుతున్న ఆయిల్ ట్యాంకర్ గుండుగొలనులో మిల్క్ ఫ్యాక్టరీ సమీపంలో ఆగి ఉన్న కంటైనర్ లారీని వెనుక నుంచి ట్యాంకర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయిల్ ట్యాంకర్ నడుపుతున్న డ్రైవర్ మృతి చెందగా అదే లారీల్లో ఉన్న సెకండ్ డ్రైవర్ గాయపడ్డాడు. అతన్ని భీమడోలు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.


మృతి చెందిన డ్రైవర్


పెద్ద పెద్ద గోతులతో రహదారి


రహదారి మొత్తం బురదమయం

అధ్వానంగా 'చింతలపూడి' రహదారులు

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలో తుపాను కారణంగా ప్రధాన రహదారులు మొత్తం పుంతరోడ్ల కంటే అధ్వాన్నంగా తయారయ్యాయి. ఏ రోడ్డు చూసినా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ప్రయాణీకులకు ఇబ్బందులు కల్గిస్తున్నాయి. నిత్యం వందల సంఖ్యలో వాహనాలతో రద్దీగా ఉండే ప్రధాన ఆర్అండ్‌బి రహదారులు సైతం దెబ్బతిని గోతులుగా మారినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. దీనికి తోడు ఎత్తు పల్లాలుగా మారిన రోడ్లలో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి. చింతలపూడి మండలం రేచర్ల, సీతానగరం వెళ్లే రోడ్డు రాత్రి సమయాల్లో రహదారుల్లో గుంతలను గుర్తించలేని వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. దీనికితోడు తుపాను కారణంగా మూలిగే నక్కపై తాటికాయ పడినట్లు చందాన వర్షపు నీటితో నిండిన గుంతలను గుర్తించక ప్రమాదాలకు గురవుతున్నారు. నిత్యం ఈ రహదారిలో ఆర్‌టిసి వాహనాలు కూడా ప్రయాణాలు సాగిస్తుంటాయి. ఇంతటి ప్రాధాన్యం కలిగిన రహదారిలో సైతం ఎక్కడ చూసినా గుంతలు, ఎగుడు దిగుడు రోడ్లే దర్శనమిస్తున్నాయి. రహదారుల పరిస్థితి అధ్వాన్నంగా ఉన్నా అధికారులు కానీ, ప్రజాప్రతినిధులు కానీ పట్టించుకోవటం లేదని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు వాపోతున్నారు.


అధ్వాన్నంగా రేచర్ల రోడ్డు

చింతలపూడి మండలం రేచర్ల సీతానగరం, గురుభట్లగూడెం వెళ్లే దారులు గుంతలతో ప్రయాణీకులకు నరకం చూపిస్తున్నాయని ప్రయాణీకులు వాపోతున్నారు. కనీసం గుంతలు పూడ్చటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చింతలపూడి పట్టణంలో కూడా రోడ్లు అధ్వాన్నంగా తయారయ్యాయి. పట్టణంలోకి వస్తుంటే, ఇది చింతలపూడి నియోజకవర్గం ప్రధాన కేంద్రమేనా అనే సందేహం కలుగుతుంది. ఇతర ప్రాంతాల నుంచి తెలంగాణ, కృష్ణ నుంచి, చింతలపూడి పట్టణానికి అనేక మంది నిత్యం వస్తుంటారు. వారు ఈ రోడ్ల, గుంతలు చూసి ఇబ్బందులు పడుతున్నారు. చింతలపూడి-ఏలూరు రహదారి దాదాపుగా గుంతలు పడి ప్రయాణీకులు నానా అవస్థలు పడుతున్నారు. నామవరం, సీతానగరం, భట్టువారిగూడెం, బాలవారిగూడెం రోడ్లు దాదాపుగా అదే పరిస్థితి నెలకొంది. కనీసం రోడ్లు మరమ్మతులైనా చేయించాలనిందిగా ప్రజలు కోరుకుంటున్నారు.

మరమ్మతులైనా చేయించండి

అవినాష్, యర్రగుంటపల్లి

చింతలపూడి పట్టణం నుంచి యర్రగుంటపల్లికి వచ్చే రహదారి దారుణంగా తయారైంది. గుంతలతో ఈ రోడ్డు వెంబడి ప్రయాణించాలంటే నరకం కనిపిస్తుంది. కనీసం మరమ్మతులు అయినా చేయించాల్సిందిగా కోరుతున్నాం.

అధికారులు దృష్టి సారించాలి

శేఖర్, యర్రగుంటపల్లి

రేచర్ల వద్ద రోడ్డు అధ్వాన్నంగా తయారైంది. నరకం కనిపిస్తుంది. అధికారులు దృష్టిపెట్టి మరమ్మతులు చేయించాలి.

గ్రీన్‌ఫీల్డ్ హైవే బాధిత రైతులకు న్యాయం చేయాలి

నష్టపరిహారం ఇవ్వాలి: సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణంలో భూములు ఇచ్చిన రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సిపిఎం కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లాడ నుంచి దేవరపల్లి వరకూ నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి వేల కోట్ల రూపాయలు కేటాయించారు, కానీ భూములు కోల్పోయిన రైతులకు సరైన న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం చేపట్టిన సంస్థలు భూమిలిచ్చిన రైతులను, ఆ ప్రాంతంలో ఉన్న ప్రజానీకానికి అవసరమైనటువంటి సర్వీస్ రోడ్ నిర్మాణం గురించి పట్టించుకోవట్లేదని విమర్శించారు. ఇప్పటివరకు నిద్రపోయి ఇప్పుడే మేల్కొన్నటువంటి ఎంపీ కోటగిరి శ్రీధర్ కూడా పార్లమెంట్లో ఇప్పటికైనా మాట్లాడినందుకు చాలా సంతోషమన్నారు. ఇప్పటికే రైతాంగం గ్రీన్ ఫీల్డ్ రైతులకి నష్టపరిహారం తగిన విధంగా ఇవ్వాలని కోరుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం ఇంతవరకు స్పందించలేదన్నారు. ఎంపీ కోటగిరి కేవలం ఎన్నికలకి ఎరగా ఉండే పద్ధతిలో మాట్లాడటం సరికాదన్నారు. కచ్చితంగా రైతులకి పరిహారం ఇచ్చే దానికోసం చిత్త సుద్ధితో చర్యలు తీసుకోవాలని కోరారు. టి.నరసాపురం, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం మండలాల్లో ఉన్నటువంటి రాష్ట్ర రహదారులు బంద్ అయ్యే పద్ధతుల్లో గ్రీన్‌ఫీల్డ్ హైవే వ్యవహరిస్తుందన్నారు. అలాగే రైతులు, రోజువారి కూలీ పని చేసుకునే ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రీన్ ఫీల్డ్ హైవే రహదారులకు సర్వీస్ రోడ్లు నిర్మించాలని తెలియజేసినప్పటికీ చింతలపూడి, టి.నరసాపురం, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం మండలాల్లో హైవేకు సర్వీస్ రోడ్లు ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇవ్వకుండా కేవలం రాకపోకలకు మెట్లు పద్ధతిలో వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఆ పద్ధతిలో వ్యవహరిస్తే ప్రజల రాకపోకలు సాధ్యం కాదని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రీన్‌ఫీల్డ్ రైతాంగానికి ఇవ్వాల్సిన పరిహారం ఇవ్వాలని, సర్వీస్ రోడ్లు, స్టేట్ హైవే రోడ్లు వాటికి తగిన విధంగా అండర్ ప్లస్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో ప్రజల పక్షాన పెద్ద ఎత్తున ఉద్యమాన్ని నిర్మిస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకి, గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణ సంస్థలను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎం.జీవరత్నం, మండల కమిటీ సభ్యులు జి.సూర్య కిరణ్ పాల్గొన్నారు.

'ఉక్కు' ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

32 మంది విద్యార్థి యువకుల ప్రాణ త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారం ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని ఎఐటియుసి జిల్లా ప్రథమ మహాసభ తీర్మానించింది. ఏలూరు స్ఫూర్తి భవనంలో జరుగుతున్న ఎఐటియుసి జిల్లా ప్రథమ మహాసభలు ఆదివారం మధ్యాహ్నం ముగిశాయి. మహాసభ చేసిన తీర్మానాలు, నిర్ణయాలను ఎఐటియుసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డి శ్రీనివాస డాంగే, కంకిపాటి బుచ్చిబాబు పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ రంగ సంస్థలను, పరిశ్రమలను ప్రయివేటుపరం చేయవద్దని మహాసభ డిమాండ్ చేసింది. అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతన సంఘం బోర్డుని నియమించి, కనీస వేతన జిఒని విడుదల చేయాలని, స్కీం వర్కర్లైన అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన పథకంలో పనిచేసే కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులగా గుర్తించి కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని, భవన నిర్మాణ కార్మికులకు సంబంధించిన కార్మిక శాఖలో పెండింగ్‌లో ఉన్న క్లైమ్లను క్లియర్ చేయాలని, గ్రామీణ ప్రాంతాలలో గ్రీన్ అంబాసిడర్‌గా పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారం నెలకు రూ.10 వేల వేతనం చెల్లించాలని, స్కూల్ ఆయాలకు, మధ్యాహ్న భోజన పథకం వర్కర్లకు ఇస్తున్న వేతనాల్ని పెంచాలని తీర్మానించారు. ఏలూరు కార్పొరేషన్, నూజివీడు, జంగారెడ్డిగూడెం, చింతలపూడి పురపాలక సంఘాలలో, నగరపాలక పంచాయతీలలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఇస్తున్న హెల్త్ అలవెన్సలను ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగ సిబ్బందికి కూడా ఇవ్వాలని మహాసభ తీర్మానం చేసిందని వారు తెలిపారు. ఇపిఎఫ్ 95 పెన్షన్ స్కీమ్ ద్వారా పెన్షన్లను పెంచాలని, ఢిల్లీలో జరుగుతున్న ఆందోళనకు ఎఐటియుసి జిల్లా మహాసభ మద్దతు తెలుపుతూ తీర్మానం చేసినట్లు వారు తెలిపారు. అనంతరం జిల్లా ఎఐటియుసి 29 మంది సభ్యులతో కమిటీని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుందన్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా రెడ్డి శ్రీనివాస డాంగే, కంకిపాటి బుచ్చిబాబు ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా కె.కృష్ణమాచార్యులు, ఉపాధ్యక్షులుగా బండి వెంకటేశ్వరరావు, జి.అంజమ్మ, బి.రాంబాబు, భజంత్రీ శ్రీనివాసరావు, ఉప ప్రధాన కార్యదర్శులుగా చాట్ల పుల్లారావు, తొర్లపాటి బాబు, కోశాధికారిగా పుప్పాల కన్నబాబు, సహాయ కార్యదర్శులుగా ఎ.అప్పలరాజు, ఎ.రాజు, కె.సైదా, కె.విగ్నేష్‌లను మహాసభ ఎన్నుకుందని శ్రీనివాస్ డాంగే, బుచ్చిబాబు తెలియజేశారు.

వాడవల్లిలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర


ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని వాడవల్లి గ్రామంలో ఆదివారం ఇఒపిఆర్‌డి డి.లక్ష్మీనారాయణ అధ్యక్షతన వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు మాట్లాడుతూ అయుష్మాన్ భారత్ ద్వారా రూ.5 లక్షల ఆరోగ్య బీమా, ఉచిత రేషన్, జలజీవన్ మిషన్ ద్వారా ఉచిత నీటి కుళాయిలకు వాడవల్లి గ్రామంలో రూ.42 లక్షల నిధులు కేంద్రం ఇచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి సుధాబత్తుల లక్ష్మి పద్మావతి, వెంకటరమణ, జిల్లా కార్యదర్శి గాజుల సిద్ధార్థ, మండల అధ్యక్షులు నాగలక్ష్మి, మండల ప్రధాన కార్యదర్శి కొల్లిపర నాగరాజు, మొవ్వ ఫణి, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

ప్రజాశక్తి - కలిదిండి

మానసికోల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని ఏలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని కోరుకొల్లులో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి చెడుగుడు పోటీలను ఆయన ప్రారంభించారు. రాష్ట్ర స్థాయిలో క్రీడలు నిర్వహిస్తున్న నిర్వాహకులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చందన ఉమామహేశ్వరరావు, మాజీ జెడ్‌పిటిసి చన్నంశెట్టి కోదండరామయ్య, సొసైటీ అధ్యక్షులు అంకెం నరసయ్య, క్రీడాకారులు పాల్గొన్నారు.


పోటీలు ప్రారంభిస్తున్న డిఎన్ఆర్


ఓటుహక్కుపై నిర్వహించిన ర్యాలీలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ అద్దయ్య

ఓటుహక్కు వినియోగంపై అవగాహన ఉండాలి

గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినీలతో నిర్వహించిన ర్యాలీ, మానవహారం కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎ.అద్దయ్య

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఓటుహక్కు వినియోగంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఎ.అద్దయ్య తెలిపారు. మండలంలోని మర్రిగూడెం గ్రామంలో ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా ఆదివారం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినిలు, స్థానికులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాఠశాలలో మానవహారం నిర్వహించి బాలికలతో సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన వారందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఓటు యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దారబోయిన లక్ష్మి వెంకటేశ్వరరావు, తహశీల్దార్ జెవి.సుబ్బారావు, సర్పంచి సోయం బిందు పాల్గొన్నారు.

కాకరవాడలో సెమీ క్రిస్మస్ వేడుకలు

ముదినేపల్లి : మండలంలోని కాకరవాడ సిఎస్ఐ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఆదివారం రాత్రి అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రదర్శించిన క్రీస్తు జననం నాటిక విశేషంగా ఆకట్టుకుంది. క్రిస్మస్ పాటలు, యువతీ యువకులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకురాలు తిరువీధుల శారద, సంఘ పెద్దలు, విశ్వాసులు పాల్గొన్నారు.

ముసునూరులో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి - ముసునూరు

ఉల్లి, ఆలుగడ్డకు కూడా తేడా తెలియని జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడం ప్రజల దురదృష్టమని నూజివీడు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం ముసునూరులోని గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాను సంభవించి లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతింటే ముఖ్యమంత్రి పరదాల మధ్య నిల్చొని పొలాలను పరిశీలించడం సిగ్గుచేటన్నారు. గతంలో హుదూద్, తిత్లీ తుపానుల సమయంలో ఆయా ప్రాంతాలకు వెళ్లి పునరుద్ధరణ పనులు సమర్థంగా నిర్వహించిన గొప్ప నాయకుడు చంద్రబాబు అని గుర్తు చేశారు. గతంలో ఇటువంటి పరిస్థితిలు ఎదురైనప్పుడు చంద్రబాబు రైతులతో నేరుగా మాట్లాడారని గుర్తు చేశారు. రాష్ట్రంలో త్వరలో ఏర్పాటయ్యేది టిడిపి, జనసేన సంయుక్త ప్రభుత్వమని రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తుందనని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కందుల పిచ్చయ్య, కొండేటి బాబి, పాకనాటి ఆంజనేయులు, గారపాటి నరసింహారావు, మెదరమెట్ల సురేంద్ర, మందలపు తోట శ్రీను, రెడ్డి కృష్ణ, నక్కా యోహాను పాల్గొన్నారు.

18 నుంచి కావూరి ఫౌండేషన్‌లో కంప్యూటర్ శిక్షణ

నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ఏలూరు

వసంతమహల్ సెంటర్ కావూరి ఫౌండేషన్ కార్యాలయంలో ఈనెల 18 నుంచి టైపు, కంప్యూటర్ శిక్షణ ప్రారంభిస్తున్నట్లు సంస్థ పౌర సంబంధాల అధికారి పులి శ్రీరాములు తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన వారికి డిసిఎ, డిటిపిలోనూ, ఇంటర్ కామర్స్ ఉత్తీర్ణులైన వారికి టాలీలోనూ శిక్షణ ఇస్తారన్నారు. ఈనెల 11 నుంచి సంస్థ కార్యాలయం వద్ద దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. ఏలూరు పరిసర గ్రామాలకు చెందిన 35 సంవత్సరాల లోపు వయసు కలిగిన యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పులి శ్రీరాములు కోరారు.


అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న జయప్రకాష్

విద్యార్థులు కష్టపడి చదవాలి

జిల్లా సాంఘిక, సంక్షేమశాఖ జాయింట్ డైరక్టర్ వి.జయప్రకాష్

ప్రజాశక్తి - చింతలపూడి

విద్యార్థులు కష్టపడి చదివితే భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో ఉంటారని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ జాయింట్ డైరక్టర్ వి.జయప్రకాష్ అన్నారు. పట్టణంలో బాలికల వసతి గృహంలో 2023-24 సంవత్సరంలో జరుగుతున్న పబ్లిక్ పరిక్షలకు ఏ విధంగా ప్రిపేర్ అవ్వాలి, ఏవిధంగా మంచి మార్కులు సాధించాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. విద్యార్థులు పదవ తరగతిలో మంచి మార్కులు సాధించాలంటే ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ డబ్ల్యూఒ రత్నకుమార్, ఎం.సునీత శ్రీనివాస్ పాల్గొన్నారు.


రైతుతో మాట్లాడుతున్న డ్వామా పీడీ

రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది

డ్వామా పీడీ ఎ.రాము

ప్రజాశక్తి - ముదినేపల్లి

తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని, రైతులకు పూర్తిస్థాయిలో ప్రభుత్వం సహకారం ఇస్తుందని డ్వామా పిడీ, మండల ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రత్యేక అధికారి ఎ.రాము అన్నారు. ఇటీవల తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు మండలంలో ముంపు బారిన పడిన వరి పొలాలను మండల స్థాయి అధికారులతో కలిసి ఆయన పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 14 వేల ఎకరాలలో రైతులు ఖరీఫ్ సాగు చేశారన్నారు. ఇప్పటివరకు 4 వేల ఎకరాలు మాత్రమే మాసూళ్ళ పూర్తయినట్లు తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో కోతకు వచ్చిన వరిపైరు నేల వాలినట్లు చెప్పారు. వర్షాలకు చేలల్లో నీరు నిలిచిపోవడంతో వరి గింజలు మొలకలు వస్తున్నాయన్నారు. రైతులు ఎవరూ భయపడవద్దన్నారు. ప్రభుత్వం అన్ని విధాలుగా రైతులను ఆదుకుంటూ పంట నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించేందుకు, రైతులకు సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే మండలంలో పంట నష్టం అంచనాలను అధికారులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఆయన వెంట మండల తహశీల్దార్ కె.శ్రీనివాస్, వ్యవసాయ శాఖ అధికారి వేణుమాధవ్, ఎపిఒ దయానంద రాజు ఉన్నారు.

నల్లమాడులో 1108 దీపోత్సవం

ప్రజాశక్తి - ఉంగుటూరు

నల్లమాడులో 1108 ఒత్తులతో కార్తీక దీపోత్సవాన్ని గ్రామస్తులు, అయ్యప్ప దీక్షా పరులు నిర్వహించారు. మహిళలు, చిన్నారులు పెద్దసంఖ్యలో దీపోత్సవంలో పాల్గొన్నారు. మాజీ సర్పంచి కండెపు అరుణకుమారి, కండెపు రవికుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.